




సచివాలయంలో కమిషనర్ తనిఖీ

నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని శోధన్ నగర్, బ్రహ్మానందపురం, దండువారి వీధి, బందావనం వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టర్లతోపాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు.స్థానిక కె.వి.ఆర్ కూడలి సమీపంలోని హొటల్ అతిథి, కస్తూరి దేవి గార్డెన్స్, రవీంద్ర నాథ్ ఠాగూర్ కళ్యాణ మండపాలను సందర్శించిన కమిషనర్ యూజర్ చార్జెస్ ను వెంటనే చెల్లించాలని నిర్వాహకులకు సూచించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న కమిషనర్

వైసిపిలో అసంతృప్తి.. ప్రభుత్వంలో అనిశ్చితి..!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు జిల్లాలోని కావలిలో పర్యటించనున్నారు. ఎంతో చారిత్రాత్మకమైన భూ సమస్యకు ఓ పరిష్కారం చూపి నిర్వహిస్తున్న ఈ సభ ఎంతో ప్రాధాన్యతమైంది. ఇదే సమయంలో వైసిపిలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. ఇప్పటికే ముగ్గురు ఎంఎల్‌ఎలు పార్టీని వీడారు. అనేక మంది గ్రూపుల రాజకీయాలు చేస్తున్నారు. ప్రభుత్వంలోనూ అనేక అనిశ్చిత పరిస్థితులున్నాయి. అవినీతి, అక్రమాలకు పెద్ద పీఠ వేస్తున్నారని, గ్రావెల్, ఇసుక, సిలీకా, జిల్లా వ్యాపితంగా వైసిపినేతల అవినీతి, అక్రమాలు సిఎంకు తలనొప్పిగా మారాయి. భూ కుంభకోణాలకు కావలి కేంద్రంగా ఉండగా, నేడు ఆయన అక్కడే సభ ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమం మంచిదైనా , ప్రస్తుత పరిస్థితుల్లో సిఎం పర్యటన ఆసక్తిగా మారింది..

- భూ కుంభకోణాల కేంద్రం కావలి
- అవినీతి, అక్రమాలు ఎదుర్కొంటున్న నేతలు
- నేడు సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు కావలిలో పర్యటించనున్నారు. జిల్లా వ్యాపితంగా ఎన్నో ఏళ్లుగా సమస్యగాఉన్న చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం దక్కనుంది. 23 వేల మంది రైతులకు సంబందించి, 43,270 ఎకరాలను భూములను 22ఎ నిషేదిత భూముల జాబితా నుంచి తొలగించనున్నారు. సంపూర్ణ భూ హక్కులు కన్పించనున్నారు. ముఖ్యమంత్రి పట్టాదారుపాస్ పుస్తకాలు అందివ్వనున్నారు. 22ఎ కింద ఉండడంతో రైతులు సాగుచేసుకుంటున్నా, రుణాలు రావడానికి, అమ్ముకోడానికి అవకాశం లేదు. ఈ సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి వాటికి విముక్తి చేస్తున్నారు. కావలిలో జరిగే బహిరంగ సభలో సిఎం ఓ అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. వైసిపి ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలో సిఎం జిల్లాకు వస్తున్నారు. నెల్లూరు రూరల్, ఉదయగిరి, వెంకటగిరి ఎంఎల్‌ఎలు పార్టీని వీడారు. దీని నుంచి ఇంకా ఆపార్టీ పూర్తిగా బయటపడలేదు. అక్కడ నాయకత్వాన్ని బలపరుచుకునే పరిస్థితుల్లో ఉన్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో కుమ్ములాటలు సాగుతున్నాయి. నెల్లూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ప్రాంతాల్లో తీవ్రమైన విభేదాలు కొనసాగుతున్నాయి. దీనిని సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పరంగా అనేక అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా వ్యాపితంగా ఇసుక, గ్రావెల్, సిలికా అక్రమ రవాణాతోపాటు, రైతులకు మద్దతు ధర, నుడా పరిధిలో అక్రమ లేవుట్లు ఇలా అన్ని వివాదాలు సాగుతున్నాయి. ప్రధానంగా కావలి నియోజకవర్గం అవినీతికి కేంద్రంగా మారింది. ఆపార్టీ నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డిని ఆపార్టీ సస్పెండ్ చేసింది. ఎంఎల్‌ఎ రామ్‌కుమార్‌రెడ్డి పైనా అనేక ఆరోపణలున్నాయి. కావలి చుట్టుపక్కల భూములు ఆక్రమణ, అక్రమ లేవుట్లు ఇలా అనేక అంశాల్లో కావలి నియోజక వర్గం ఇబ్బందికరంగా మారింది. ఎంఎల్‌ఎ అవినీతిని ముఖ్యమంత్రికి చెబుతామని అఖిలపక్ష పార్టీలు ఇప్పటికే మీడియా సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు. కొంత ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏం జరుగుతుందోననే ఆందోళన ప్రజల్లో నెలకొంది.



వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, సిఎం

నేడు సిఎం పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు కావలిలో పర్యటించనున్నారు. అందుకు సంబందించి ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు ఉదయం 9.35 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో కావలి బయల్దేరుతారు. ఉదయం 10.30 గంటలకు కావలి జెడ్‌పి హైస్కూల్ మైదానంలోని హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ ప్రజా ప్రతినిదులతో మాట్లాడుతారు. అనంతరం కావలి మినీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. సిఎం పర్యటన ఏర్పాట్లను మంత్రికాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణ, ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి, ఎంఎల్‌ఎ రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.



ప్రజల సహకారంతో చెత్త సేకరణ : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ ప్రణాళి కాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి సహకరించాలని కమిషనర్ కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. గురువారం స్థానిక 36వ డివిజను ఫతేఖాన్ పేట రైతు బజార్ శానిటేషన్ మస్టర్ పాయింట్ ను ఆయన తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలోని శాంతి నగర్, పోలీస్ క్వార్టర్స్, మూలాపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్ సిబ్బంది హాజరును కమిషనర్ పరిశీలిస్తూ, డివిజనుల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. స్థానిక మూలాపేట స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ ఘాట్ ప్రాంగణం పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ప్రజలతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ చెత్త సేకరణ యూజర్ చార్జీలను ప్రతిఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కోరారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సూపర్వైజర్లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

లస్కర్లకు జీతాలు ఇవ్వలేరా..!

22 నెలలు జీతాలు లేకపోతే ఎలా - ఎస్ఇ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

లస్కర్లుకు 22 నెలలుగా జీతాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, వ్యవసాయశాఖ మంత్రికి ఇప్పించే దమ్ముందా అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం ఇరిగేషన్ ఎస్ఇ కార్యాల యం ఎదుట దీక్ష చేపట్టి ఉద్యోగులకు చంద్రమోహన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఇరిగేషన్ శాఖలోని లస్కర్ల కుటుంబాలు ఎలా బతకాలన్నారు. నెలకు రూ.10,500 జీతంతో పనిచేసే ఆ చిరుద్యోగులపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులు మానవత్వం, కనికరం చూపారా అన్నారు. రైతుల కోసం సాగునీటి పారుదలను పర్యవేక్షిస్తూ రేయింబవళ్లు శ్రమించే లస్కర్లకు జీతాలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వానికి దిక్కులేదన్నారు. జిల్లాలో 347 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా 40 మంది రెగ్యులర్ ఉద్యోగులుగా సేవలం దిస్తున్నారు. 223 మంది కాంట్రాక్టు విధానంలో నెలకు రూ.10,500 జీతంతో పనిచేస్తున్నారని, రెగ్యులర్ ఉద్యోగులకు నెల జీతం రూ.70 వేలు అయితే కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చేది రూ.10,500 మాత్రమేన న్నారు. జీతాలు ఇప్పించమని కోరుతూ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దగ్గరకు ఒకసారి వెళితే చూస్తామన్నారంట..రెండో సారి వెళితే ఇంకేం పనిలేదా అని కసురుకున్నారన్నారు. ఇలాంటి చిరుద్యోగుల కష్టాలు ఆయనకు ఎందుకు పడుతాయన్నారు. లస్కర్లకు 22 నెలలకు సంబంధించి జీతమిస్తే రూ.2.30 లక్షలు వస్తుందని, ఆయన మాత్రం నెలకు రూ.3 లక్షలు జీతం తీసుకుంటానన్నారు. అడ్డగోలు సంపాదన గురించి నేను మాట్లాడటం లేదని, ..మంత్రిగా ఆయన అధికారికంగా పొందే రూ.3 లక్షల గురించే చెబుతున్నానన్నారు. లస్కర్లకు గతంలో రూ.6 వేలుగా ఉన్న జీతాన్ని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.10,500కి పెంచాము.. మీరు అది కూడా చెల్లించరా అన్నారు. నెల ఆలస్యమైందంటే అర్థముంది...ఏకంగా 22 నెలల పాటు జీతాలు చెల్లించకుండా ఉండటానికి మీకు మనస్సెలా వస్తోందన్నారు. కింది స్థాయి ఉద్యోగులకు జీతాలు రాకపోతే నెలా నెలా లక్షల రూపాయలు వేతనాలతో పాటు అదనపు మొత్తాలు పొందే ఎస్ఇ, ఈఈ, డీఈలు ఏం చేస్తున్నారన్నారు. సాధారణంగా ప్రాజెక్టులు, పెట్టుబడుల కోసం ప్రభుత్వాలు అప్పులు చేస్తుంటాయి. నెల జీతాల కోసం కూడా అప్పు చేస్తున్న ఘనత సిఎం జగన్ రెడ్డికే దక్కుతుందని ఆర్థిక నిపుణుడు జీవీ రావు వ్యాఖ్యానించారన్నారు. . జిల్లా వ్యాప్తంగా కొన్ని వందల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. 223 లస్కర్ల కుటుంబాలకు రెండేళ్ల జీతాలుగా రూ.6 కోట్లు ఇప్పించలేని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి సిగ్గుతో తలదించుకోవాలన్నారు. జిల్లా ప్రధాకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, తిరుపతి పార్లమెంట్ రైతు అద్యక్షులు రావూరి రాధాకష్ణమ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి, గుమ్మడి రాజా యాదవ్, సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్,సి.ఐ.టి.యు టౌన్ కార్యదర్శి నాగేశ్వరరావు, అఖిలపక్ష రైతు సంఘం జిల్లా కన్వనర్ గంగపట్నం రమణయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య, షాజహాన్, కాంగ్రెస్ రైతు సంఘం నాయకులు వేటూరి శ్రీనివాసులు రెడ్డి, ఏ.ఐ.టి.వి.సి. మున్నా, గోపాల్ నాయుడు, మామిడాల మధు, కోవూరు మధు, సుందరారామి రెడ్డి, జన్నీ రమణయ్య, రఘుబాబు, కోడూరు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు



లస్కర్లుకు మద్దతు తెలుపుతోన్న సోమిరెడ్డి , అఖిలపక్ష నేతలు

'వేసవి సెలవుల్లో విధుల నిర్వహణ సరికాదు '

ప్రజాశక్తి-నెల్లూరు :విద్యాశాఖ కమిషనర్ నుంచి, జిల్లా విద్యాశాఖాధికారి నుంచి, పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉపాధ్యాయులకు రాత పూర్వక ఉత్తర్వూలు అందజేయకుండా వెసవి సెలవు దినాల్లో పనిచేయించుకోవడం దారుణమని, విద్యాశాఖను నాన్ వెకిషన్‌గా గుర్తించాలని ఉపాధ్యాయ యూనియన్ ఫ్యాప్టో డిమాండ్ చేసింది. గురువారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవులల్లో ఉపాధ్యాయులకు ఎస్‌సిఈఆర్‌టి నిర్దేసించిన బాధ్యతలను, ఊయ్ లవ్ రీడింగ్, కార్యక్రమాలకు, పదవ తరగతి పరీక్షలల్లో తప్పిన వారికి అదనపు తరగతల నిర్వహణకు సంబంధించి ఏ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాతపూర్వకమైన ఉత్తర్వులు అందజేయ లేదన్నారు. వెకేషన్ డిపార్టుమెంట్ అయిన విద్యాశాఖలోని ఉపాధ్యా యులచే వేసవి సెలవుల్లో పనిచేయించుటను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ఎ.సురేంద్రరెడ్డి, సెక్రటరీ జనరల్ చిట్టేటి రమేష్, డిప్యూటి సెక్రటరీ జనరల్ వి.వి.శేషులు, సిహెచ్ హజరత్, కార్యదర్శి సిహెచ్ చలపతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐటిడిపి కో ఆర్డినేటర్‌గా అశోక్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :వలేటివారిపాలెం మండల తెలుగుదేశం పార్టీ ఐటిడిపి కోఆర్డినేటర్‌గా చుండి గ్రామానికి చెందిన మేకల అశోక్‌ను నియమించారు. ఆ మేరకు గురువారం కందుకూరు టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనకు నియామ కపత్రం అందజేశారు. అశోక్ మాట్లా డుతూ పార్టీ కార్యక్రమా లలో చురుకుగా పాల్గొనేం దుకు అవకాశం కల్పించిన పార్టీకి, మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరశింహంకు, నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తె లిపారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.




నియామకపత్రం అందుకుంటున్న అశోక్

ఆరో తరగతిలో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- వలేటివారిపాలెం :మండలంలోని చుండి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి శ్రీవెంకటేశ్వర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.పూర్తి వివరాలకు 8184854200, 9440929729, 8074551521 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా విజయలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆడిటింగ్ విభాగంలో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న షేక్ సుల్తాన్ బాషాను ఒంగోలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. కందుకూరులో సీనియర్ అసిస్టెంట్ పని చేస్తున్న శోభారాణి బదిలీ కాగా ఆమె స్థానంలో టి.నరసింహారావు బాధ్యతలు చేపట్టారు.



విజయలక్ష్మి

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి -కందుకూరు :పట్టణంలోని లక్ష్మీ తిరుమల కళ్యాణ మండపంలో 22వ వార్డుకు చెందిన పేర్నమిట్ట శ్రీనివాసులు, పద్మావతి కుమారుడు సాయి కోటేశ్వరరావు, నాగజ్యోతి వివాహానికి గురువారం కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఇంటూరి నాగేశ్వరరావు నూతన వధూ వరులను ఆశీర్వదించారు. మాజీ కౌన్సిలర్ కొచ్చెర్ల శ్రీనివాసరావు, చుండి అక్కయ్య పాల్గొన్నారు.

సిపిఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణ పరిధిలోని ప్రశాంతి కాలనీలో సిపిఐ జెండా ఆవిష్కరణ జరిగింది. గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు పాల్గొని జండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు.పేద, బడుగు, బలహీనవర్గాలు, కార్మిక, కర్షకుల కోసం సిపిఐ ఉద్యమిస్తుందన్నారు. సిపిఐ నాయకులు నత్త రామారావు ,సింగయ్య, మధు, పాండు, మహేష్, మోష్ తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కందుకూరు : నెల్లూరు టిడిపి కార్యాలయంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజిజ్ జన్మదిన వేడుకలు జరిగాయి. గురువారం టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ పాల్గొన్నారు. ఆయన అజీజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కందు కూరు నియోజ కవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



అజీజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇంటూరి రాజేష్

కరోనా బీమా నగదు స్వాహా ఉదంతంపై
క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు

కరోనా బీమా నగదు స్వాహా అవినీతి కుంభకోణంలో పాత్రదారులైన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బాలాజీ నగర్ ప్రాంతంలోని డాక్టర్ రామచంద్ర రెడ్డి భవన్ , డివైఎఫ్ఐ కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ మాట్లాడుతూ కోవిడ్ స్కీం నిధుల దుర్వినియోగం అయ్యాయన్నారు. ఈ వ్యావహారంలో ఇందుకూరుపేట మండలం సచివాలయం ఒకటిలోని సిబ్బంది, సచివాలయ మహిళా పోలీస్ విజయలక్ష్మి ఇందులో ప్రధాన సూత్రధారిగా ఉన్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. భారీ స్థాయిలో ఆరోపణలు వస్తున్నా, జిల్లా అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కరోనాతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డయని, ఈ పరిస్థితి అందరికి తెలిసిందే అన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయినా తండ్రి లేదా తల్లిని కోల్పోయినటువంటి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీం లో కరోనా బారిన పడ్డ ప్రజలకు 1,50,000 నుంచి 2 లక్షల వరకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ సమాచారం బయటకు రాకుండా చేసిన అధికారులు,హాస్పిటల్స్ ఇన్సూరెన్స్ కెంపెనీ ప్రతినిధులు, జిల్లా హెల్త్ ఆఫీసర్లు అందరూ కలిసి ఈ నిధులను కొల్లగొట్టి తమ జేబులు నింపు కున్నారన్నారు. కరోనా రాకుండానే కరోనా వచ్చినట్లు పాజిటివ్ సర్టిఫికెట్లు హాస్పటల్ అడ్మిట్ అయినట్టు సర్టిఫికెట్లు సష్టించి ఇన్సూరెన్స్ అధికారులను కలుపుకొని ఈ స్కీమ్లో జిల్లా మొత్తం నిండా కోట్ల రూపాయలు కుంభకోణాలు జరిగినట్లు అనుమానం వస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై క్రిములు కేసు నమోదు చేయాలని సహకరించిన హాస్పిటల్స్ ను సీజ్ చేసి డాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కుమార్, జగదీష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -ఉలవపాడు :ఉపాధి కూలీల సమస్యలు తెలుసు కునేందుకు గురువారం ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామంలో కంచర్లమ్మ కుంట వద్ద జరుగుతున్న ఉపాధి పనులను సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ పరిశీలించారు. ఆయన కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిరుతోటి సుబ్బారావు, మెట్లు కొచ్చెర్ల దొరసాని, మద్దిరాల అరుణకుమారి పాల్గొన్నారు. ఉపాధి హామీపథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల15న కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ధర్నాకు ఉపాధి కూలీలు హాజరుకావాలని కోరారు.

వలేటివారిపాలెం :ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15వ తేదిన నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు కూలీలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండారెడ్డి పాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశానికి వెళ్లిన ఆయన గురువారం కూలీలతో మాట్లాడారు. కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జివిబి కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి, చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శిం చారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు దువ్వూరి జాన్, బ్రహ్మయ్య ఉన్నారు.



ఉలవపాడు మండలంలో సమస్యలు తెలుసుకుంటున్న జివిబి కుమార్

తోపుడు బండ్లు అందజేత

ప్రజాశక్తి -కందుకూరు

పట్టణంలోని 25వ వార్డు కొత్తకుమ్మరిపాలెంలో నివాసముండే కలికివాయి సుజాత కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి తోడుగా నిలిచేందుకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సుజాతకు తోపుడు బండి అందజేశారు. పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు నాయకులు గుర్రం మల్లికార్జున, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డేళ్ళ రవిచంద్ర, పార్టీ నాయ కులు బద్దిపూడి శిఖామణి, మణికే మాల్యాద్రి, జడ రవీంద్ర పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఒకటో వార్డు ఏకలవ్య నగర్‌కు చెందిన నిరుపేద మహిళ పర్రె ధనమ్మకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం తోపుడు బండి అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి చేయూతనందించి, ఆయా కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల అధ్యక్షులు నార్నే రోశయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు పొడపాటి మహేష్, కొండముడు సుపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు మాదాల రవి, నాయకులు ఉన్నం కొండలరావు, మణికే మాల్యాద్రి, దాసరి వినోద్, షేక్ రసూల్ బి ఉన్నారు.



తోపుడు బండి అందజేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బిపిఇడి పరీక్షలు నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - వెంకటాచలం

విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న బి.పి.ఈ.డి పరీక్షలు నిర్వహించాల్సి వుంటే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకపోవడం సరికాదు అని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడిపోగు కిరణ్ కిషోర్ కోరారు. ఈ మేరకు వి.ఎస్ యు రిజిస్టర్ కి వినతి పత్రం అందజేశారు. 2019 నుంచి 2021 వరకు చదువుకున్న విద్యార్థులకు సప్లమెంటరీ నిర్వహించకపోవడం, గ్రేస్ పీరియడ్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇప్పటికైనా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ ఎదుట ఆందోళనకు దిగు తామని తెలిపారు. మట్టిగుంట బాబ్జి, రత్నం రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

సమిష్టి కృషితో అభివృద్ధి

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సమిష్టి కృషి చేస్తేనే సంస్థ అభివృద్ధి చెందుతుందని దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అన్నారు. గురువారం నగరంలోని విద్యుత్తు భవన్ ఆవరణంలోని స్కాడా భవనంలో విద్యుత్తు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. డిస్కామ్ డైరెక్టర్లు ఎన్.వి.ఎస్. సుబ్బరాజు,కె.శివ ప్రసాద్ రెడ్డి ,వి.ఎన్. బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. గురవయ్య, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని , నెల్లూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్,సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్,అసిస్టెంట్ ఇంజనీర్స్ అకౌంట్స్ విభాగపు అధికారులు పాల్గొన్నారు.

ఈకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి రిటైర్డ్ అయి పెన్షన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరు విధిగా ఈ నెల 15వ తేదిలోగా ఈకెవైసి చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎం గౌస్, ఎస్‌పివిఎన్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. పెన్షనర్ల సహాయార్థం ట్రెజరీ అధికారుల సూచనల మేరకు జిల్లా ట్రెజరీ కార్యాలయం, డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయం, ఎన్‌జిఓ సంఘ భవనం, మూలాపేట ప్రాంతంలోని సరస్వతి సమాజం, ఎసి నగర్ ప్రాథమిక పాఠశాల, భక్తవత్సలనగర్ ప్రాంతంలోని పెన్షనర్ల భవన్, పాత జెడ్‌పి భవనంలో ఈకెవైసి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సృజనాత్మక విలువలు పెంచుకోండి

ప్రజాశక్తి-మర్రిపాడు

పాఠశాలలోని పాఠ్యాంశాలతోపాటు గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానంతో పాటు సజనాత్మకతను పెంపొందించుకోవచ్చని పంచాయతీ కార్యదర్శి సికిందర్, తపాల అధికారి రమీజ్ అహ్మద్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను వారు సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి బాల్యం నుంచే విలువలతో కూడిన విద్యనభ్యసించి సమాజ సేవకు పాటుపడాలన్నారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులచే ఆంగ్ల తెలుగు కథల పుస్తకాల పఠనం, స్వతహాగా పిల్లలచే కథలు చెప్పించడం, పొడుపు కథలు, ఆంగ్ల జంబ్లింగ్ పదాలు నేర్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి సుబ్బారెడ్డి, తపాలా ఉద్యోగి ఖాజా రంతుల్లా, గ్రామస్తులు వేంపాటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీమల్లికార్జున స్వామి కామాక్షితాయి ధ్వజారోహణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండవ రోజు గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, ఉచిత ప్రసాద వితరణ, పందిర్లు, అన్నప్రసాదం, దర్శన క్యూ లైన్ తదితర ఏర్పాట్లు దేవస్థానం చైర్మన్ పుట్ట లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. ధ్వజారోహణ కార్యక్రమానికి ఉభయకర్తగా పాటూరు వాస్తవ్యులు వుక్కం శివకుమార్, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్త లుగా వ్యవహరించారు.కార్యక్రమంలో విశేష సంఖ్యలో మహిళలు పాల్గొని కొడిముద్దలను భక్తి శ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్, గుమ్మా రఘురామయ్య, ముంగర శివ కుమార్ తిరుమూరు సుప్రజ, ఉములూరు విమల, బట్టేపాటి విజయమ్మ, గుంటూరు కామేశ్వరి, కాగొల్లు పద్మ, ఎక్స్ అఫీసీఓ సభ్యులు శ్రీశైలం శేఖర్ శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



నూరు శాతం హాజరు ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు బయోమెట్రిక్ హాజరు 100 శాతం ఉండాలని ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం స్థానికబిట్ - 1,2,3 సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వాలంటరీలు ఉదయం 10:30 లోపల సచివాలయంలో ఉండాలని బయోమెట్రిక్ హాజరు 100 శాతం ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సచివాలయం ద్వారా అర్హులు వంద శాతం పెండింగ్ లేకుండా చేయాలన్నారు. ఎవరు కూడా ఉద్యోగం పట్ల నిర్లక్ష్యం గా ఉండకూడదని అట్టి వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రజలకు సిబ్బంది అన్నివేళలా సహకరించాలని ముఖ్యంగా హౌసింగ్ కి సంబందించిన లిస్టులను వాలంటరీ వారిగా ఇచ్చి వారు ఇల్లు త్వరగా పూర్తిచేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాదర్ కరిముల్లా, ప్రసన్న. మండల కో ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

పసుపు యార్డును ప్రారంభించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపి రాజమోహన్‌రెడ్డి సోదరుడిని రైతు సంఘ నాయకులు కాకు వెంకటయ్య కలిశారు. గురువారం మండలంలోని బ్రాహ్మణ పల్లి లోని తమ నివాసంలో రైతు సంఘం నాయకులతో పంచాయతీ రైతులు ఆయనను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ లో పసుపు యార్డును ప్రారంభించి కొనుగోలుకు రైతుల దగ్గర సిద్ధంగా ఉన్న పసుపును ప్రభుత్వం సంబంధిత అధికారులు వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పసుపు బీమా పథకాన్ని కూడా వర్తింపజేసి అధిక వడ్డీలతో లక్షలు వెచ్చించి పండించిన పంటకు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర ప్రకారం కొనుగోలు చేసి రైతు కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కష్టాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24సంవత్సరంలో 11వతరగతిలో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాస రావు తెలియజేశారు. దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు 01.06.2006కు ముందుగాని 31.07.2008 తరువాత జన్మించినవారు అనర్హులు.2022-23 సంవత్సరంలో పదవ తరగతి జిల్లాలోని ప్రభుత్వం చే గుర్తింపబడిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు 75శాతం పట్టణ ప్రాంత అభ్యర్థులకు 25శాతం, బాలికలకు 33శాతం సీట్లు కేటాయించ బడ్డాయి.వెనుకబడిన కులాలకు, షెడ్యూల్, షెడ్యూల్ తెగలకు, వికలాంగులకు రిజర్వేషన్ ఉందన్నారు. దరఖాస్తు చివరి తేదీ మే 31, పరీక్షతేదీ జూలై 31.పరీక్ష ఉదయం 11.30నుంచి 1.30వరకు ఉంటుందని తెలిపారు.

దళిత ఉద్యమ నాయకురాలికి నివాళి

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలో మనుబోలుపాడు గ్రామంలో గురువారం పైడి కాంతమ్మ ఆదరణ కూటమిని ఆమె కుమారులైన పైడి కాంతారావు, పైడి రవి ఆధ్వర్యంలో హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కమిటీ సభ్యులు కొప్పాల రఘు. అనంతరం పైడి కాంతారావు, పైడి రవి వారి కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు కొప్పాల రఘు మాట్లాడుతూ మండలంలోని తొలిసారిగా అట్రాసిటీకి గురైన దళిత మహిళ పైడి కాంతమ్మ అని అన్నారు. స్థానిక మనుబోలుపాడు గ్రామ అగ్రకులాల కమ్మవారు అన్యాయంగా దళిత భూములను ఆక్రమించిన తీరుపై పైడి కాంతమ్మ ఉద్యమానికి నడుం బిగించింది. తన ఉద్యమాన్ని విరామం లేకుండా పోరాడి అగ్రకులాల కబంధహస్తాలలో బిగిచ్చుకుపోయిన దళిత భూములను విడిపించి జిల్లాకి పేరు తెచ్చిన ఆమె మన దళిత ముద్దు బిడ్డ పైడి కాంతమ్మ. ఆనాటి రాజకీయ శక్తులు అడ్డం వచ్చిన ఆక్రమణకు గురైన దళిత భూమికోసం పోరాడి మండలంలోనే కాదు జిల్లాలో కూడా చైతన్యం రగిలించిన ఆమె ఉద్యమం ఈనాటి యువతరానికి కూడా ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. దళిత ఉద్యమాలకు నడుం బిగించి మహిళా లోకానికి చాటిచెప్పిన కాంతమ్మ సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండలం సీనియర్ దళిత నాయకులు జూపూడి మల్లన్న, ఎస్ ఎన్‌పిఎస్ సమితి జిల్లా కార్మిక సంఘం గౌరవ సలహాదారులు వీరతాటి వెంకటేశ్వర్లు, బుచ్చి మండల కన్వీనర్ జ్యోతి పెంచలయ్య, కావలి డివిజన్ దళిత నాయకులు దారా శ్రీనివాసరావులు, కాంతమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని నందవరం మోడల్ స్కూల్ లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. 5వ తరగతి పాసైన విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మే 9నుండి 25లోపు ఆన్లైన్ లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసి, బీసీ లకు రూ.150, ఫీజు చెల్లించాలన్నారు. పరీక్ష జూన్ 11న ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఆదర్శ పాఠశాలలో జరుగునని ప్రిన్సిపల్ తెలియజేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

ప్రజాశక్తి-కావలి+ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కావలి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, హెలిపాడ్, బహిరంగ సభ వేదిక వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్వం సిద్ధం చేశామని మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కావలిలో సిఎం పాల్గొనే బహిరంగ సభ వేదిక వద్ద ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలసీల రఘురాంతో కలిసి ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, సిఎంకు ఘన స్వాగతం పలికేందుకు రైతులందరూ ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర రైతాంగానికి నేడు పండుగ రోజు అని, నేటి నుంచి చుక్కల భూముల సమస్య శాశ్వతంగా పరిష్కారం కానున్నదన్నారు. జిల్లాలో సుమారు 23 వేల మంది రైతులకు సంబంధించి సుమారు 43,270 ఎకరాల భూములను 22ఎ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి, సంపూర్ణ హక్కులు కల్పిస్తూ, ముఖ్యమంత్రి స్వహస్తాలతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసే చారిత్రాత్మక ఘట్టానికి కావలి పట్టణం వేదిక కావడం అదష్టంగా పేర్కొన్నారు. అసాధారణ నిర్ణయంతో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించి, రైతుల పక్షపాతిగా విచ్చేస్తున్న ముఖ్య మంత్రికి స్వాగతం పలికేందుకు కావలి పట్టణం ముస్తాబైం దన్నారు.రైతాంగానికి అన్ని విధాలా అండగా ఉంటున్న ముఖ్య మంత్రికి రైతులం దరూ తమ ఆశీస్సులు అందించాలని ఆకాంక్షిం చారు.రాష్ట్రంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. పంట నష్టపోయిన రైతులకు బీమా, ఇన్పుట్ సబ్సిడీ త్వరలోనే అందిస్తామన్నారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు..!

నిద్రావస్థలో అధికారులు

ప్రజాశక్తి-వరికుంటపాడు+నిబంధనలకు విరుద్ధంగా ఉప్పు వాగు, పిల్లా పేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులు వారిపై కన్నెత్తి చూడడం లేదు. దీంతో అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా ఇష్టాను సారంగా ఇసుకను తరలిస్తున్నారు. పిల్లా పేరు వాగు పరిసర పరివాహక ప్రాంతాలైన, తూర్పు బోయమడుగుల, అలివేలు మంగాపురం, జడదేవి, తూర్పు చెన్నంపల్లి, కనియంపాడు, గనేశ్వరపురం, ఉప్పు వాగు పరివాహక ప్రాంతాలైన తిమ్మారెడ్డిపల్లి, టి.కొండ రెడ్డి పల్లి, దక్కునూరు, రొంపి దొడ్ల, నుంచి పగలు రేయి తేడా లేకుండా పదుల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మండలంతోపాటు సరిహద్దుల్లోని ప్రకాశం జిల్లా పామూరు సైతం ఇసుక తరలిపోతుంది. ట్రక్కు ధర రూ.4వేల నుంచి 5వేలవరకు పలుకుతుంది. వాగుల్లో పెద్ద పెద్ద గోతులుగా దర్శనమిస్తున్నాయి. ఇలా గోతులుగా దర్శనమిస్తే భవిష్యత్తులో నీరంతా ఇంకిపోతుంది. ఇక నీటి చెమ్మ అనేది కనిపించదు. నిబంధనల మేరకే ప్రభుత్వానికి పన్ను చెల్లించి ఇసుకను తరలించాల్సి ఉండగా మండలంలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతుంది. నిరోధించాల్సిన సెబ్, పోలీస్, అధికారులు మాత్రం మిన్నకుండిపోయారు. ఎవరైనా విషయం తెలియపరిస్తే మాత్రమే నామ మాత్రం దాడులు చేసి పట్టుకుంటున్నారు. తిరిగి రాజకీయ నాయకుల వత్తిడితో వారిని వదిలి వేస్తున్నారు. ఈ తతంగం ఇలాగే నిత్యం కొనసాగుతుంది. జిల్లా ఉన్నతాధికారు దష్టి సారిస్తే ప్రభుత్వానికి ఆదాయం చేకూరడంతో పాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట చేయొచ్చని పలువురు అంటున్నారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

ప్రజాశక్తి-కోవూరు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తహశీల్దార్, మైనింగ్, జలవనరుల శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఓ వైపు నుంచి గ్రావెలు మరోవైపు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్నారు. కిలోమీటర్ల మేర 30 అడుగులలో పైబడి అక్రమంగా కోట్లాది రూపాయల సంపద అక్రమ రవాణా జరుగుతుందని తెలిపారు. రానున్న తర్వాత ఒక గంప గ్రావెల్ ఇసుక దొరికే పరిస్థితి ఉండదన్నారు. వైసీపీ నాయకులకు తలొగ్గి పనిచేస్తున్న అధికారులు అందరికీ ఒకటే చెబుతున్నా ఈ ప్రభుత్వం ఎనిమిది నెలలకు మించి నిలబడదు రానున్న ప్రభుత్వాలకి మీరు సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. .వారి అక్రమ సంపాదనకు మీరు సాక్షులుగా నిలవద్దన్నారు. గురువారం జమ్మిపాలెం వద్ద అధికారులు తనిఖీ చేసే గంట వదిలేసి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందన్నారు. ఈ విషయమై జల వనరుల శాఖ ఎస్ఇని, తహశీల్దార్ మైనింగ్ డిపార్ట్మెంట్‌ని సంప్రదించామన్నారు.ఓసారి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఇది ప్రజా ఉపయోగాలు కోసం సేకరించినదా లేదా అక్రమంగా తరలిపోతుందా విచారణ చేపట్టి దోషుల్ని శిక్షించాల్సిన పరిస్థితి ఉందని తెలియజేశారు. సరైనా అనుమతులు చూపకుండా జగన్ ఇళ్లకు తోలుతున్నామని చెప్పినా..ఆయా ప్రదేశాల్లో ఇసుక అవసరత లేకపోయినప్పటికీ రోజూ లెక్క లేనన్ని ట్రాక్టర్లతో అక్రమ రవాణా వలన స్థానికులకు ఇసుక గ్రావెల్ అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలన్నా వారి అవసరాలకి గ్రావెల్, ఇసుక దొరికే పరిస్థితి లేదన్నారు. మాఫియా మహమ్మారిని వీలైనంత త్వరగా కట్టడి చేయాలన్నారు. లేనిచో జనసేన పార్టీ తరపున ఆందోళన చేపట్టి కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటమే కాకుండా రేపోమాపో వచ్చే వరదల నుంచి కూడా గ్రామాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా, ఉపాధ్యక్షులు సుదీర్ బద్దపూడి, జిల్లా కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, సిటీ కార్యదర్శి హేమచంద్ర యాదవ్, సిటీ నాయకులు షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

వర్క్‌షాప్‌నకు విశేష స్పందన



మాట్లాడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సింహపురి చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వర్క్ షాప్‌కు విశేష స్పందన కనిపించింది.ఈ కార్యక్రమానికి ఎపి చిల్డ్రన్స్ క్లబ్ రాష్ట్ర బాధ్యులు కోరండ్ల రమాప్రభ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె వర్క్ షాపునకు హాజరైన చిన్నారుల నుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని బాల బాలికలతో బాలల సంఘాలను ఏర్పాటు చేసి చిన్న నాటి నుంచే చిన్నారుల్లో స్నేహ సంబంధాలను పటిష్ట పరిచేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అదే సమయంలో చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి ఆయా రంగాల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు రకరకాల కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకర మన్నారు. విద్యార్థి దశలో పిల్లలకు విద్యను అందించ డంలోనూ వారి ఇష్టపడేటు వంటి క్రీడలలో రాణించ డంలోనూ స్నేహ సంబంధాలు మెరుగు పడతాయన్నారు. నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్‌తో ఎక్కువ సంబంధం లేకుండా అందరితో కలిసి మెలిసి ఐక్యతగా సమాజ పరిస్థితులకు అనుగుణ ంగా నైతిక విలువలతో మానవత్వంతో మెలిగేలా బాలబాలికను తయారు చేయడానికి ఈ బాలల సంఘాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. వేసవి సెలవులలో




అదేవిధంగా వారికి సెలవు రోజులలో వారిని ఒక ప్రాంతంలో కూర్చోబెట్టం వల్ల స్నేహపూర్వక వాతావరణం సృష్టించడం సాధ్యమౌతుందన్నారు. జిల్లా బాధ్యులు షేక్ మస్తాన్ బి మాట్లాడుతూ నేటి బాల బాలికలే రేపటి పౌరులు దేశానికి భవిష్యత్తు ఇచ్చేటువంటి వెలుగు రేఖలని వారిలోని నైపుణ్యతను వారి ఇష్టానుసా రంగా ఏదైతే వారు కోరుకునేటు వంటి క్రీడా రంగాలలోనూ పిల్లలకు స్వేచ్ఛనివ్వాలన్నారు. అదేవిధంగా బాలబాలికలలో చిన్నతనం నుంచే సోదర భావం కలిగి ఉండాలని వ్యవహరించాలన్నారు. ఆ విధంగా మొదటి గురువు కన్నతల్లిగానే ఉంటుంది కాబట్టి పిల్లలను ఈనాటి సమాజ పరిస్థితుల ను తెలియజేస్తూ పెంచాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా పిల్లలతో వీలైనంత సమయం తల్లిదండ్రులు గడపాలన్నారు. అదేవిధంగా ఈ వేసవి సెలవులలో పిల్లలకు రైతులు ఏ విధంగా వ్యవసాయంలో కష్టపడతారు ఆహార ధాన్యాలు పండ్లు కూరగాయలు పువ్వులు ఏ విధంగా పండిస్తారు తెలియచేయాలని ఆహార పదార్థాలను వ్యర్థం చేయరాదని అనేటువంటి విషయాలు తెలియచేయాలని కోరారు. ఈరోజు వర్క్ షాప్ లో బాల బాలికలకు రంగు కాగితములతో బొమ్మలను తయారు చేయడం అదేవిధంగా లెక్కలలో ఈజీగా చేయగలిగే ట్రిక్స్ ను తెలియజేయడం రకరకాల ఆటలను ఆడించడం చేయడం జరిగింది. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, యువజన సంఘం, విద్యార్థి సంఘం, ఆవాజ్ ,జన విజ్ఞాన వేదిక, ప్రజానాట్యమండలి, యు.టి.ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



హాజరైన పిల్లలు

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు: గర్భిణులను సకాలంలో గుర్తించి, వైద్యపరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం అందజేసి రక్తహీనత అరికట్టి ప్రసవ ప్రణాళికను అనుసరించి సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య సిబ్బందికి పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులందరూ



మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

సమిష్టి కృషి చేయడం ద్వారా మాతృమరణాలు, శిశు మరణాలను అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. అనంతరం అడిషినల్ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో టి.బి. కేసుల నమోదు చేయడంలో డాక్టర్లు అలసత్వం ప్రదర్శించరాదన్నారు. టి.బి వ్యాధి గ్రస్తులను సకాలంలో గుర్తించి వైద్యచికిత్సలు అందజేయడం వల్ల క్షయ వ్యాధి వ్యాప్తి, తీవ్రతను తగ్గించడం సాధ్యమౌతుం దన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ సమిష్టి కృషితో మధుమేహం, రక్తపోటు కేసులను గుర్తించి నివారణకు కృషి చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ దోమల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిమో బి.శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కె.కనకరత్నం, ఎస్ఓ సహన, డిపిఒ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి:పదవ తరగతి పూర్తయిన విద్యార్థి విద్యార్థులకు ఐటిఐ దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 తేదీన ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన ఒక ప్రకటన తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రిషన్ 40 సీట్లు, ఫిట్టర్‌లో 40 సీట్లు కలవని ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చని తెలిపారు. 98667 20544, 9963950604 ఈ నంబర్లు సంప్రదించగలరని తెలిపారు.



అబ్దుల్ అజీజ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు: టిడిపి జిల్లాకార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, రూరల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ జన్మ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి, అజీజ్‌లను భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ కు తెలుగు మహిళలు హారతులు పట్టారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్య సుప్రభాత సేవ చదివే వేదపండితులు, ఫాదర్ జోసెఫ్ ఆయన బందం, ముస్లిం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.తదనంతరం అబ్దుల్ అజీజ్ నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని, ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కాంక్షిస్తూ నూరు కేజీల కేక్ ను కట్ చేశారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, నాయకులు కార్యకర్తలు హాజరై అబ్దుల్ అజీజ్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ జన్మదిన వేడుకలు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారని సర్వ మతాల నుంచి మత పెద్దలు వచ్చి ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించడం సంతోషకరమన్నారు. అబ్దుల్ అజీజ్ చదువుకున్నవారని విషయపరిజ్ఞానం ఉన్నవారని అన్ని మతాల గురించి ఆయనకున్న పరిజ్ఞానం తమకు ఎవరికీ లేదని, ఆయనకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. మేయర్ గా ఉన్నప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో నగరాన్ని ఎనలేని అభివద్ధి చేశారని, అది ఒక చరిత్రని, ఆ సమయంలో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. నగరాన్ని టీడీపీ ప్రభుత్వ హయాంలో 5550 కోట్ల తో అప్పటి మంత్రి నారాయణ, మేయర్ అజీజ్ లు అభివద్ధి చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, మేకల నరేంద్ర రెడ్డి, రాజా నాయుడు, సాబీర్ ఖాన్, సురేంద్ర బాబు, యశ్రబ్, రమేష్ చౌదరీ, రసూల్, ఆషిక్ అలీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కావలి:సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు కావలిలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ ఎం. హరి నారాయణన్, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలసీల రఘురాంతో కలిసి బహిరంగ సభ ప్రదేశాన్ని సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు.అధికారులకు తగు సూచనలు, ఆదేశాలిచ్చారు. సీటింగ్ ఏర్పాట్లు, విఐపి గ్యాలరీలు, పార్కింగ్, భద్రతాపరమైన ఏర్పాట్ల ను పరిశీలిం చారు. కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్‌పి హిమవతి, నుడా వైస్ ఛైర్మన్ టి.బాపిరెడ్డి, కావలి ఆర్‌డిఒ శీనా నాయక్, ఆర్అండ్ బి ఎస్ఇ గంగాధర్, డిపిఒ సుస్మిత, అధికారులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రానికి నెల్లూరు పాలెం క్లస్టర్‌కు చెందిన రైతులు 1027 పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. వీటిలో 1014బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారు.వివిధ కారణాలతో 02పొగాకు బేళ్లను తిరస్కరించారు. అధిక బరువుతో ఉన్న 11పొగాకు బేళ్లను వేలా నికి తిరస్కరించారు. వీటిలోఎన్ఎస్ 01సి ఆర్01ఉన్నాయి.కిలో పొగాకు గరిష్ట ధర 200 రూపాయలు. కనిష్ఠ ధర 175రూపాయలు.సగటు ధర197.32నమోదు, వేలంలో 10మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొ న్నారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

14న హనుమాన్ జయంతి

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని విరువూరు గ్రామంలో ఈనెల 14న ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయని భక్తులం దరికీ అన్న ప్రసాదం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.



ఆహార పొట్లాలు అందజేస్తున్న దృశ్యం

ఆహార పొట్లాలు అందజేత

ప్రజాశక్తి-కావలి: హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఐ.డి. పార్టీ హెడ్ కానిస్టేబుల్ రామగిరి. సత్యనారాయణ (పోలీస్ సత్యం)ద్వితీయ వర్ధంతి సందర్భంగా జలదంకి గ్రామం లోని గౌరవరం మేజర్ కాలువ కట్ట గిరిజనులకు చికెన్ బిరియాని పాకెట్స్ గురువారం హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు సయ్యద్.ఘనీబాషా అందజేశారు. తొలుత రామగిరి. సత్యనారాయణ చిత్రపటానికి గిరిజనుల సమక్షంలో పూలమాల వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా, రామగిరి. అనుదీప్, సయ్యద్. హఫీజ్ అలీ, దేవరకొండ. విజయ్, చేవూరి. ప్రభయ్య తది తరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: మండలంలోని నల్లపరెడ్డిపల్లి గ్రామంలో వైసిపి నాయకులు ఏడెం శ్రీనివాసులురెడ్డి కుమారుడు సందీప్ రెడ్డి వివాహానికి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, వైసిపి నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, బత్తిన నారాయణ రెడ్డి, పూనూరు రమేష్ రెడ్డి తదితరులు హాజరై నూతన వరుడిని ఆశీర్వదిం చారు .గురువారం నల్లపరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వరుడిని ఆశీర్వదించారు. వారి వెంట వైసిపి నాయకులు ఏడెం పెంచలరెడ్డి తదితరులున్నారు.



కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంఎల్ఎ

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కలిగిరి :మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారాములవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారని గ్రామస్తులను బొల్లినేని రామారావు ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్తులు తనపై చూపుతున్న ప్రేమ, గౌరవం,ఆదరాభిమానాలు ఎన్నటికీ మరపురాని అనుభూతులుగా మిగిలిపోతాయన్నారు.ఆ సీతారాముల వారి దీవెనలు గ్రామస్తులపై అనునిత్యం ఎల్లవేళలా ఉండాలని మనసారా కోరుకుంటూ ఉన్నామన్నారు. అంతేగాక బొల్లినేని రామారావు ఆలయ పరిసరాలను పరిశీలించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రామాలయం ఎంతో అద్భుతంగా నిర్మించారని, రాతితో ఇంతటి ఆలయం నిర్మాణం చేయించిన గ్రామస్తులకు కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బొల్లినేని రామారావు వెంట స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.